## క్లుప్తంగా

### స్నేహితుల చేయూత



రఘునాథపల్లి: నిడిగొండకు చెందిన ఆటో డ్రైవర్ మొగిలి నర్సింగరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. నర్సింగరావుకు భార్య యాకలక్ష్మితో పాటు ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. వారి ఆర్థిక ఇబ్బందులు గుర్తించిన సహచర ఆటోడ్రైవర్లు, చిన్ననాటి స్నేహితులు అండగా నిలిచారు. స్థానిక ఆటోడ్రైవర్లు రూ.30 వేలు, చిన్ననాటి స్నేహితులు రూ.60 వేలు జమచేశారు. ఇద్దరు చిన్న కూతుళ్ల పేర జనగామ తపాలా కార్యాలయంలో రూ.90 వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. మంగళవారం వారు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలు అందజేశారు.

### కాంగ్రెస్ ఓబీసీ సెల్ ఆధ్వర్యంలో నిరసన

జనగామ: కాంగ్రెస్ పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలని నిరసన తెలుపుతూ ఆ పార్టీ అనుబంధ ఓబీసీ సెల్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. జిల్లా కాంగ్రెస్ ఓబీసీ సెల్ చైర్మన్ లోక్కుంట్ల ప్రవీణ్, జనగామ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొన్నె మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులకు ఎమ్మెల్యే వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కర్రె రాజశేఖర్, బండ్రు సిద్దులు, సర్వర్, శీలం కొండల్ రెడ్డి, నాగరాజు, యాసిన్, బాల్నె నరేష్ గౌడ్, నాగేందర్, బత్తిని నిఖిల్, బస్వరాజు మల్లేష్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

### ఓటుహక్కు ప్రాధాన్యతను చాటాలి



దేవరుప్పుల: ప్రజా సంక్షేమం కోసం పరిపాలన దక్షత కలిగిన చట్ట సభల ప్రతినిధులను ఎన్నుకునేందుకు ప్రాధాన్యత కలిగిన ఓటు హక్కు విలువను ప్రజల్లో చాటాలని తహసీల్దార్ ఎడ్ల రవీందర్‌రెడ్డి సూచించారు. మంగళవారం కామారెడ్డిగూడెం హైస్కూల్‌లో 13వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల స్థాయి వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి సీహెచ్ ఉపేందర్, లక్ష్మణ్‌జీ, సజ్జన్ రావు, రామ్మూర్తి, ఓడపల్లి ప్రవీణ్,రజనీ, ఎంఆర్‌సి సిబ్బంది నర్సింహ్ములు, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

### అంబులెన్స్‌లో ప్రసవం

నర్మెట: మండలంలోని దొంగలచెలిమె తండాకు చెందిన భూక్య దివ్య అంబులెన్స్‌లో పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. తండాకు చెందిన దివ్యకు పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో మంగళవారం రాత్రి ఎంసీహెచ్‌కు తరలిస్తుండగా మార్గం మధ్యలోనే దివ్య పండంటి బాబుకు జన్మనిచ్చింది. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు సిబ్బంది ఈఎంటీ రాకేష్, అమర్‌నాథ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

### చేనేతకు చేయూతనిస్తున్న ప్రభుత్వం

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం చేనేతలకు చేయూతనందిస్తుందని రాష్ట్ర మాజీ ఆప్కో చైర్మన్ మండల శ్రీరాములు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని శ్రీ శివభక్త మార్కండేయ ఆలయంలో మార్కండేయ జయంతి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు వేముల బాల్‌రాజు, బేతి కృష్ణమూర్తి, మంగళంపల్లి కృష్ణమూర్తి, గుర్రపు బాల్‌రాజు, ఘణపురం నాగేష్, ఆనంద్, మురళి, కేశవులు పాల్గొన్నారు.

### స్థల పరిశీలన



చిల్పూరు: చిల్పూరు గుట్టపై డ్రెయినేజీ నిర్మాణానికి ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఎంపీపీ సరితబాలరాజు మంగళవారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమవుతున్నందున గుట్టపై నుంచి ఎల్లమ్మ ఆలయ సమీపంలోని వాగు వరకు డ్రెయినేజీ నిర్మాణం చేయడంతో గుట్ట కింది ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీఓ మధుసూదన్, పంచాయతీ కార్యదర్శి అజీజ్ పాషా, ఏఈ భూక్య రజిత, అర్చకులు రవీందర్‌శర్మ తదితరులు ఉన్నారు.

# అంధత్వ నివారణే లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: అంధత్వ నివారణే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా కంటివెలుగు కార్యక్రమాన్ని చేపట్టారని ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. మండలంలోని తాటికొండలో నిర్వహిస్తున్న రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని ఎమ్మెల్యే మంగళవారం సందర్శించారు. ముందుగా గ్రామంలోని డాక్టర్ బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఏ ఒక్కరూ కంటి చూపు సమస్యతో బాధపడవద్దని కేసీఆర్ తీసుకువచ్చిన కంటివెలుగు కార్యక్రమం విజయవంతం అయ్యేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. కంటివెలుగు కార్యక్రమాన్ని అమలు చేస్తున్నందుకు ముఖ్యమంత్రి ఫ్లెక్సీకి పుష్పాభిషేకం చేశారు. జెడ్పీటీసీ మారపాక రవి, ఎంపీపీ కందుల రేఖగట్టయ్య, డీఎంహెచ్ఓ డాక్టర్ మహేందర్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజు, ఉపసర్పంచ్ మారపాక రాములు పాల్గొన్నారు.

చిల్పూరు: కంటి వెలుగు కార్యక్రమం కనుల చందంగా మిగలాలని అందుకు వైద్య సిబ్బంది, అధికారులు వంద శాతం పూర్తి చేయాలని ఎమ్మెల్యే రాజయ్య అన్నారు. మండలంలోని నష్కల్, శ్రీపతిపల్లిలో కంటి వెలుగు శిబిరాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కర్ణకంటి స్వప్న, కేశిరెడ్డి ప్రత్యూషారెడ్డి, ఎంపీపీ సరితబాలరాజు, ఎంపీటీసీలు పాశం శిరీష, అయిలమ్మ, చిల్పూరు ఆలయం, మార్కెట్ చైర్మన్‌లు శ్రీధర్‌రావు, గుజ్జరి రాజు తదితరులు ఉన్నారు.



స్టేషన్‌ఘన్‌పూర్: సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి పుష్పాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రాజయ్య తదితరులు

**నియోజకవర్గం దేవాలయం.. అందుకు నా రెండు కళ్లు దానం**

నియోజకవర్గం తనకు దేవాలయం లాటిదని, ఇక్కడి ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఎమ్మెల్యే చెప్పారు. అందుకు తాను చనిపోయాక తన కళ్లను నియోజకవర్గంలోని ఇద్దరికి చూపు వచ్చేలా చేస్తే అప్పుడు కూడా నాప్రజలను చూసే అవకాశం వస్తుంది.. అందుకే దానంగా రాసిచ్చా అన్నారు.

**కంటి వెలుగును వినియోగించుకోవాలి**

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని అందరూ వినియోగించుకోవాలని మండలంలోని బచ్చన్నపేట, ఆలింపూర్ గ్రామాల సర్పంచ్‌లు వడ్డెపల్లి మల్లారెడ్డి, నరెడ్ల బాల్‌రెడ్డి అన్నారు. గ్రామాల్లో కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమంలో పలువురికి కంటి అద్దాలను వారు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సిద్దార్థరెడ్డి, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**కంటి సమస్యలపై నిర్లక్ష్యం చేయొద్దు**

దేవరుప్పుల: కంటి సమస్యలపై ప్రజలు నిర్లక్ష్యం వహించొద్దని డాక్టర్ యేల అనిల్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని హైస్కూల్‌లో కొనసాగుతున్న కంటివెలుగుల శిబిరంలో 153 మందికి వైద్యపరీక్షలు చేసి 50 మందికి, ధర్మాపురంలో 161 మందికిగానూ 33 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. డాక్టర్ మనోజ్, ఆప్తాల్మాలిస్టు బొబ్బిలి, ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## టాయిలెట్ల నిర్మాణం

జనగామ: పట్టణంలోని హనుమకొండ రోడ్డులో నివసిస్తున్న సంచార జాతుల కుటుంబాల అవసరార్థం జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజు సొంత ఖర్చులతో ఆరు టాయిలెట్ల నిర్మాణం చేపట్టి తనలోని మానవత్వాన్ని చాటుకున్నాడు. తనకూతరు తేజశ్రీఅలోక్, కుమారుడు అర్జున్ వంశీ పుట్టిన రోజు పురస్కరించుకుని సంచార జాతుల విన్నపం మేరకు మంగళవారం టాయిలెట్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంచార జీవనం చేస్తూ బతుకుతున్న 200 కుటుంబాల పరిస్థితి చూసి చలించిపోయానన్నారు. మహిళ, ఆడపిల్ల ఆత్మగౌరవమే ముఖ్యంగా టాయిలెట్ల నిర్మాణం కోసం ముందుకు రావడం జరిగిందన్నారు.



సంచార కుటుంబాలతో మాట్లాడుతున్న డాక్టర్ సుగుణాకర్‌రాజు

## వృత్తి నైపుణ్యం పెంచుకోవాలి

దేవరుప్పుల: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా గొర్రెలు, మేకల పెంపకందారులు తమ వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలని ఎంపీపీ బస్వ సావిత్రి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రూపొందించిన క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. తహసీల్దార్ ఎడ్ల రవీందర్‌రెడ్డి, పశువైద్యాధికారి సింధుప్రియ, జీగరి యాదగిరి, కుమార్ ఉన్నారు.

## భవిష్యత్ కార్యాచరణ సాధనకు దోహదం

దేవరుప్పుల: బ్యాంకుల విలీనంతో పేరుకపోయిన అపరిష్కృత సమస్యల సాధన కోసం భవిష్యత్ కార్యాచరణ చేపట్టేందుకు నిర్వహించే సమావేశాలకు అధిక సంఖ్యలో హాజరు కావాలని యూబీఏయూ టీఎస్ ప్రాంతీయ కార్యదర్శి కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకులో ఈ నెల 28, 29 తేదీల్లో హైదరాబాద్‌లో తలపెట్టిన యూనియన్ బ్యాంకు అవార్డ్ ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర వార్షిక సమావేశాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాకేష్, శైలేష్‌భగత్, అసిస్టెంటు మేనేజర్ ఉదయ్‌కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

జనగామ: జనగామ పట్టణంలోని ఏబీవీ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహిచారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పాఠశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ మహంకాళి హరిశ్చంద్రగుప్త ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల బోధన అద్భుతంగా ఉందన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.

చిల్పూరు: చిన్నపెండ్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్ఎం రవీందర్‌రావు, ఉపాధ్యాయుల, విద్యార్థులు పాల్గొన్నారు.

**స్వపరిపాలన దినోత్సవం**

కొడకండ్ల : మండలంలోని మొండ్రాయి ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి స్వపరిపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. హెచ్ఎంగా ఆశ్రీనా, డీఈఓగా నితిన్‌లతో పాటు పలువురు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కర్పూరీ ఠాకూర్‌కు నివాళి



జనగామ రూరల్: స్వాతంత్ర్య సమరయోధుడు, ఉపాధ్యాయుడు జననాయక్ కర్పూరీ ఠాకూర్ జయంతి వేడుకలు జిల్లా కేంద్రంలో నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ పోకల జమున, సంఘం జిల్లా అధ్యక్షుడు జిల్లెల గణేష్, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి అభినాష్, అరిగెల శ్రీరాములు, ప్రభాకర్, వీరస్వామి, వెంకటస్వామి, భిక్షపతి, శ్రీనివాస్, అశోక్, కిష్టయ్య, రాజు, ఉపేందర్ పాల్గొన్నారు.

## ప్రభుత్వాల తీరును ఎండగట్టాలి



మాట్లాడుతున్న జగదీశ్‌చందర్‌రెడ్డి

లింగాలఘణపురం: ఇటు రాష్ట్రంలో, అటు దేశంలో బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాల తీరును ఎండగట్టాలని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీశ్‌చందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కొల్లూరి నర్సింహులు అధ్యక్షతన హాత్ సే హాత్ జోడో కార్యక్రమ విజయవంతానికి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు ముఖ్యఅతిథిగా జగదీశ్‌చందర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కేసీఆర్ అవినీతి అక్రమాలకు కేర్ ఆఫ్‌గా మారాడని, దేశంలో బీజేపీ మతతత్వ విధానాలు, పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో సామాన్యులు ఏ విధంగా ఇబ్బంది పడుతున్నారో వివరించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. 26న ప్రతి గ్రామంలో జాతీయ జెండాతో పాటు కాంగ్రెస్ పార్టీ జెండాలను ఆవిష్కరించాలని కోరారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె రమేష్, స్థానిక సర్పంచ్ విజయ్‌మనోహర్, ఎంపీటీసీ భిక్షపతి, న ర్సయ్య, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దిలీప్‌రెడ్డి, రమేష్, శేఖర్ పాల్గొన్నారు.

## భూ పంపిణీతోనే పేదరిక నిర్మూలన

లింగాలఘణపురం: రాష్ట్రంలో పేదల సమస్యల పరిష్కారం భూ పంపిణీతోనే సాధ్యమవుతుందని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘాలకు జరిగిన జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలు పోరాటాలు చేస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. రమేష్, వెంకటరాజం, యాదగిరి, శేఖర్, దేవదానం హాజరయ్యారు.

## స్టడీ సెంటర్ల ఏర్పాటు

పాలకుర్తి టౌన్: పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగులకు గ్రంథాలయాలను మరింత చేరువ చేసేందుకు మండల కేంద్రాల్లో ఉన్న శాఖ గ్రంథాలయాల తోపాటు మరిన్ని స్టడీ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎడవెల్లి కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రములోని శాఖ గ్రంథాలయంతో పాటు గూడూరులోని చౌడవరపు విశ్వనాథం స్మారక గ్రంథాలయాన్ని స్టడీ సెంటర్‌గా ఏర్పాటు చేసేందుకు పరిశీలించారు. సంస్థ కార్యదర్శి ఎం. సుధీర్, సర్పంచ్ కొమురయ్య, పుల్లయ్య, సతీష్ ఉన్నారు.

## వైభవంగా మార్కండేయ జయంతి



బచ్చన్నపేట: పూజ చేస్తున్న సమితి సభ్యులు



జనగామ రూరల్: మహాయజ్ఞంలో పాల్గొన్న పద్మశాలీలు

బచ్చన్నపేట: మండల కేంద్రంలో మార్కండేయ జయంతిని పురస్కరించుకొని మార్కండేయ ఆలయంలో ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. మంగళవారం ఆలయంలో శివభక్త సేవా సమితి ఆధ్వర్యంలో మహాగణపతి పూజ, అభిషేకాలు జరిపారు. వందలాదిగా తరలివచ్చిన పద్మశాలీ కులబాంధవుల సమక్షంలో మృత్యుంజయ మహాహోమం నిర్వహించారు. అదే విధంగా ట్రాక్టర్‌పై మగ్గం ఏర్పాటు చేసి కుటుంబ సభ్యుల సమేతంగా గ్రామంలో భారీగా ఆటపాటలతో ఊరేగింపు చేపట్టారు. ట్రాక్టర్‌పైనే వస్త్రం తయారుచేసి స్వామివారికి సమర్పించారు. ఆలయ పూజారి ఘనపురం ఆనంద్, సేవా సమితి సభ్యులు మచ్చ నరేందర్, బేతి క్రిష్ణమూర్తి, గుర్రపు బాల్‌రాజు, కృష్ణమూర్తి, పెండెం నాగేష్, కేశవులు, లక్ష్మణ్, నాగేష్, సిద్ధిరాములు, సుధాకర్, సిద్ధిలింగం, కిషన్, సత్యం, పాండు, నవీన్, లక్ష్మయ్య, మురళి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

**పట్టణంలో..**

జనగామ రూరల్: పట్టణంలోని క్లాం రోడ్‌లో ఉన్న శ్రీ భక్తమార్కండేయ స్వామి దేవాలయంలో మార్కండేయ జయంతి ఉత్సవాలు పోపా కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆలయంలో మార్కండేయ స్వామి మహాయజ్ఞం చేపట్టారు. ఈ సందర్భంగా చిలుకూరి నారాయణ జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పోపా అధ్యక్షుడు దోర్నాల వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, సింహాద్రి, విజయ్‌కుమార్, రాజేష్, విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

**కొడకండ్లలో..**

కొడకండ్ల: మండలకేంద్రంలోని పద్మశాలీ భవన్‌లో మార్కండేయ జయంతి వేడుకలను పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మార్కండేయ చిత్ర పటానికి పూజలు నిర్వహించి ఆయురారోగ్య, అష్టైశ్వరాలు ప్రసాదించాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మధుసూదన్, సంఘం నాయకులు నవీన్, ప్రభాకర్, మోహన్, రాజు, ఉప్పలయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# మహిళలంటే అపార గౌరవం

- ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

నర్మెట: మహిళలంటే మాకు అపార గౌరవం ఉంది.. మాటలను వక్రీకరించడం కాదు చేతనైతే కేంద్రం మెడలు వంచి నిధులు తేవాలని ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించిన ఆయన పరీక్షల నిమిత్తం వచ్చిన పలువురితో మాట్లాడారు. పేరుకే జాతీయ పార్టీలు తెలంగాణకు చేసిన అభివృద్ధి శూన్యం... ముఖ్యమంత్రి కేసీఆర్ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను చూసి తట్టుకోలేని దద్దమ్మల్లా బురద జల్లే కార్యక్రమాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావంతో కాంగ్రెస్, బీజేపీకి చెమటలు పడుతున్నాయన్నారు. ఆయన వెంట సర్పంచ్ ఆమెడపు కమలాకర్‌రెడ్డి, ఎంపీపి తేజావత్ గోవర్ధన్, జడ్పీకోఆప్షన్ ఎండి గౌస్, వైస్ఎంపీపీ మంకెన ఆగిరెడ్డి, ఎంపీడీఓ ఎండి. ఖాజామొయిఉద్దీన్, డిప్యూటి డీఎం అండ్ హెచ్ఓ డా.లగిశెట్టి అశోక్ కుమార్, వైద్యాధికారి డా. కిషోర్, డా. అశోక్, ఏపీఎం నాగేశ్వర్ రావు, టీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు చింతకింది సురేష్, నీరటి సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



నర్మెట: శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

## ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం




జనగామ రూరల్: వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ కళింగ రాజు, జిల్లా అధికారులు

జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో జాతీయ బాలికా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీ లక్ష్మీబాయి బాలికల ఆత్మరక్షా ప్రశిక్షణ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు కరాటే శిక్షణ ఇచ్చారు. పలువురు మాట్లాడుతూ బాలికలు చదువుతుతోపాటు ఆత్మరక్షణ విద్యలో రాణించాలన్నారు. అనంతరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో డీఈఓ రాము, ప్రజాప్రతినిధులు, అధికారులు, హెచ్ఎంలు, కరాటే మాస్టర్లు, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

–జనగామ రూరల్/రఘునాథపల్లి/తరిగొప్పుల/లింగాలఘణపురం/పాలకుర్తిటౌన్/స్టేషన్‌ఘన్‌పూర్



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ రాము



తరిగొప్పుల: కరాటే శిక్షణ పొందుతున్న విద్యార్థినులు



లింగాలఘణపురం: కస్తూర్బా పాఠశాలలో..

## రసాభాసగా డబుల్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక



అధికారులతో వాగ్వాదం చేస్తున్న గ్రామస్తులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని సముద్రాలకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన 40 డబుల్‌బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల తుది జాబితా ఎంపిక కోసం గ్రామంలో మంగళవారం నిర్వహించిన గ్రామసభ రసాభాసగా జరిగింది. జీపీ కార్యాలయంలో సర్పంచ్ గుండె విమలనర్సయ్య అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభకు ముఖ్య అతిథిగా తహసీల్దార్ పూల్‌సింగ్ చౌహాన్ హాజరయ్యారు. ముందుగా లబ్ధిదారుల ఎంపిక నియమ, నిబంధనలు, వచ్చిన దరఖాస్తులు, లబ్ధిదారుల జాబితా తదితర నివేదికను ఆర్ఐ అర్జున్ తెలిపారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామానికి 40 డబుల్‌బెడ్రూం ఇళ్లు మంజూరీ కాగా అర్హత ఉన్న పేదలు దరఖాస్తు చేసుకోవాలని నెలరోజుల క్రితం సూచించామన్నారు. మొత్తంగా రెండువందల మందికి పైగా దరఖాస్తులు చేసుకోగా స్క్రీనింగ్ చేసి చివరకు 46 మందితో జాబితాను తయారు చేశామన్నారు. అయితే మొత్తం 40 ఇళ్లు మంజూరు అయినందున 46 మందిలో లబ్ధిదారులను లాటరీ పద్ధతిలో 40 మందిని ఎంపిక చేస్తామన్నారు. అయితే లాటరీ పద్ధతి వద్దని గ్రామస్తులు వాదించారు. అర్హులైన నిరుపేదలను నేరుగా ఎంపిక చేయాలని అధికారులతో వాగ్వాదం చేశారు. దానికి తహసీల్దార్ స్పందిస్తూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనిచేస్తామని, లాటరీ పద్ధతికి సహకరించాలని కోరారు.

**లాటరీ పద్ధతిలో..**

ప్రజలు, అధికారుల వాగ్వివాదాలు, గొడవల అనంతరం ఎట్టకేలకు లాటరీ పద్ధతికి గ్రామస్తులు అంగీకరించగా తహసీల్దార్ లాటరీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారు. మొత్తంగా 40 ఇండ్లకు చివరకు 46 మంది జాబితా ఉండగా అందులో ఎస్సీలకు 20 ఇళ్లకు గాను 26 మంది పేర్లను డబ్బాలో వేసి లాటరీలో అందులో నుంచి 20 మందిని ఎంపిక చేశారు. అనంతరం ఇందులో మిగిలిన ఆరుగురి పేర్లు, జాబితాలోని బీసీలు 21 మందిని కలిపి డ్రా పద్ధతిలో మిగిలిన 20 ఇళ్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ అర్జున్, సర్పంచ్ గుండె విమలనర్సయ్య, ఎంపీటీసీ పడిశాల సుగుణవెంకటేష్, కార్యదర్శి రొయ్యల నరేష్,ఉపసర్పంచ్ ఇమ్మడి ప్రసాద్ పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**పల్లెప్రగతితో పంచాయతీల పురోగతి**

దేవరుప్పుల: పల్లెప్రగతి పనులతో పంచాయతీలు పురోగతి సాధిస్తున్నాయని ఎంపీడీఓ టి.సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం రామరాజుపల్లి శ్మశాన వాటిక ఏరియాలో ఎంపీటీసీ మేడ కళ్యాణి వెంకటేష్ కేటాయించిన ఎస్ఎఫ్‌సీ నిధులతో నీటి వసతి కోసం బోరు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సర్పంచ్ బండి స్నేహనర్సింహ్ములు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

**బీజేపీ అభివృద్ధిని అడ్డుకుంటున్న రెడ్డి వర్గీయులు**

స్టేషన్‌ఘన్‌పూర్: జిల్లాలో భారతీయ జనతా పార్టీ అభివృద్ధిని రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నాయకులు అడ్డుకుంటున్నారని పార్టీ రాష్ట్ర నాయకుడు మాదాసు వెంకటేష్ అన్నారు. డివిజన్ కేంద్రంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఘన్‌పూర్ ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గంగా ఉన్నప్పటికీ ఇక్కడ రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారి పెత్తనమే సాగుతుందని, జిల్లాకు చెందిన రెడ్డి నాయకులు వచ్చి రాజకీయాలు చేస్తూ పార్టీ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు.

**పోటీ తత్వాన్ని అలవాటు చేసుకోవాలి**

బచ్చన్నపేట: మారుతున్న కాలానికి అనుగుణంగా పోటీ తత్వాన్ని విద్యార్థులు అలవాటు చేసుకోవాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ బక్క శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కట్కూర్‌లో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు.

**వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి**

తరిగొప్పుల: పశువులకు సోకే వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సహయోగి ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు మహేష్ అగర్వాల్ అన్నారు. మంగళవారం మండలంలోని బొత్తలపర్రెలో సహయోగి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రైతులకు పాడి ఆవులను పంపిణీ చేశారు.

**బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడిగా కందుకూరి నరేష్**

రఘునాథపల్లి: కంచనపల్లికి చెందిన కందుకూరి నరేష్‌ను ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడిగా నియమించారు. మంగళవారం హనుమకొండలో నరేష్‌కు ఎమ్మెల్యే నియామకపు ప్రతిని అందజేశారు. అదే విదంగా ఎమ్మెల్యే రాజయ్య బీఆర్ఎస్ మండల సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శిగా రఘునాథపల్లికి చెందిన కరింకొండ నాగరాజును నియమించారు.

**పెండింగ్ బిల్లులు చెల్లించాలి**

జనగామ రూరల్: ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సాంబరాజు దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో పోత్కనూరి ఉపేందర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు బిల్లులు రాక అవస్థలు పడుతున్నారన్నారు. మల్లేష్, ఎల్లయ్య ఉన్నారు.

**ఎన్నిక**

కొడకండ్ల: మండల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు గోలి చంద్రప్రకాష్, కోశాధికారి తాండ్ర ప్రవీణ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. మండల అధ్యక్షుడిగా రాపోలు మురళీ, ప్రధాన కార్యదర్శిగా కొటగిరి అనీల్‌కుమార్, కోశాధికారిగా కల్వచర్ల నాగరాజు, గౌరవ అధ్యక్షుడిగా దయానంద్‌తోపాటు సభ్యులను ఎన్నుకున్నారు.

**సన్మానం**

పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం నూతన చైర్మన్ వెనుకదాసుల రామచంద్రయ్యశర్మ, ధర్మకర్త మండలి సభ్యులను మంగళవారం మండల కేంద్రాంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్‌కుమార్ సన్మానించారు. జెడ్పీ చైర్మన్ పాగల సంపత్‌రెడ్డి, జెడ్పీటీసీ పుస్కురి శ్రీనివాస్‌రావు, ఎండీ మదార్ పాల్గొన్నారు.

**నియామకం**

లింగాలఘణపురం: మండలంలోని చీటూరుకు చెందిన పసుల అశోక్ బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు భాషా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

**చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి**

బచ్చన్నపేట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, అప్పుడు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మండలంలోని బండనాగారం సర్పంచ్ శివరాత్రి కవిత అన్నారు. మంగళవారం గ్రామంలోని క్రీడా ప్రాంగణంలో పాఠశాల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. హెచ్ఎం లక్ష్మయ్య, ఉప సర్పంచ్ రాజలింగం పాల్గొన్నారు.

**జాతీయ మహాసభలకు రమేష్‌రాజా**

పాలకుర్తి టౌన్: సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ 11వ జాతీయ మహాసభలకు మండల కేంద్రానికి చెందిన మామిండ్ల రమేష్‌రాజా వెళ్లనున్నారు.

**పండిట్, పీఈటీ పోస్టులు అప్‌గ్రేడ్ చేయాలి**

కొడకండ్ల: పండిట్, పీఈటీ పోస్టులు అప్‌గ్రేడ్ చేసి ప్రమోషన్లు ఇవ్వడంతో పాటు బదిలీల్లో జీరో సర్వీస్‌ను అనుమతించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. 13 జిల్లాల్లో స్పౌజ్ సమస్యలను పరిష్కరించాలని, జీరో స్టాండింగ్‌తో అందరికి బదిలీల్లో అవకాశం కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాయకులు వెంకటాద్రి, చంద్రమౌళి, కిష్టయ్య, రాజనారాయణ, రాజేందర్, సత్యనారాయణ, మొయినొద్దీన్ పాల్గొన్నారు.

**భాషాపండితుల నిరసన**

దేవరుప్పుల : భాషాపండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల పదోన్నతుల పట్ల ప్రభుత్వ వివక్ష తగదని కడవెండి హైస్కూల్‌లో మంగళవార భోజన సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు.

**రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు**

స్టేషన్‌ఘన్‌పూర్: ఇప్పగూడెం శివారులోని పెట్రోల్ బంక్ సమీపాన రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు గాయపడిన సంఘటన మంగళవారం జరిగింది. మండలంలోని సముద్రాలకు చెందిన కన్నెబోయిన అంజయ్య తన బైక్‌పై కాజీపేట నుంచి సముద్రాలకు వస్తున్నాడు. ఈ క్రమంలో ఇప్పగూడెంకు చెందిన జీడి కల్యాణ్, గౌతమి దంపతులు ద్విచక్రవాహనంపై ఘన్‌పూర్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఇప్పగూడెం శివారులో బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనగా అంజయ్య, కల్యాణ్, గౌతమికి గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు.

**రైలు నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు**

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఛాగల్లు శివారులో రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి పడి గుర్తు తెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడగా స్థానికులు గమనించి అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎంకు తరలించారు.